ఆధార్ సేవలు.. అంతంత మాత్రం

రెండు కేంద్రాలే పని చేయడంతో అవస్థలు


ఆధార్ అప్‌డేట్ కోసం ప్రైవేట్ ఆధార్ కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

మేడపాడు గ్రామానికి చెందిన బోణం నవ్యాలక్ష్మీ ఇంటర్‌మీడియట్ సెకండియర్ చదువుతుంది. ఆమె జేఈఈ మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతుంది. దానికి దరఖాస్తు చేసే సమయంలో కంప్యూటర్ ఆధార్ అప్‌డేట్ అడిగింది. దీంతో ఆమె తన ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు ఆమె స్వగ్రామంలోని మేడపాడు సచివాలయానికి వెళ్లగా మేడపాడు సచివాలయంలో ఆధార్‌కు చెందిన ల్యాప్‌టాప్ చెడి పోయిందని చెప్పారు. బాగు చేసేందుకు పంపామని ఇంకా వెనక్కి రాలేదని కనుక కొంతేరు గ్రామం వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేసుకోమని చెప్పారు. దీంతో ఆమె కాలేజీ మానివేసి తన తండ్రిని తీసుకుని కొంతేరు వెళ్లగా అక్కడ డిజిటల్ అసిస్టెంట్ (డీఏ) సెలవులో ఉన్నారని చెప్పడంతో మళ్లీ వారు పాలకొల్లు వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాల్సి వచ్చింది.

యలమంచిలి: మండలంలో ఆధార్ సేవలు అటకెక్కాయి. ప్రజలకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు ప్రభుత్వ సేవలను దగ్గర చేశారు. ఈ విధంగా యలమంచిలి మండలంలో 32 గ్రామాలు ఉండగా 23 గ్రామ సచివాలయాలను ఏర్పాటుచేశారు. మండల కేంద్రం యలమంచిలితోపాటు మేడపాడు, దొడ్డిపట్ల, కొంతేరు, చించినాడ గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దొడ్డిపట్ల సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ బదిలీపై వెళ్లిపోవడంతో అక్కడ ఆధార్ సేవలు నిలిచిపోయాయి. మేడపాడు సచివాలయంలో ఆధార్ పని చేసే ల్యాప్‌టాప్ చెడిపోయింది. దాని మరమ్మతు కోసం తిరిగి పంపగా ఇంత వరకు వెనక్కి రాలేదు. దీంతో ఈ కేంద్రంలోను ఆధార్ సేవలు నిలిచిపోయాయి. కొంతేరు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ఉన్నత చదువులు నిమిత్తం లాంగ్‌లీవ్ పెట్టారు. దీంతో ఇక్కడ ఆధార్ సేవలు నిలిచిపోయాయి. ఇక మిగిలిన యలమంచిలి, చించినాడ సచివాలయాలకు చేరుకోవడానికి సరైన రవాణా వ్యవస్థ లేదు. దీంతో మండల ప్రజలకు ఆధార్ సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యం సుస్పష్టం

సచివాలయ సేవలకు తూట్లు పొడుస్తూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల వద్దకే పాలనే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సచివాలయాల సేవలు ఒక్కొక్కటిగా మరుగునపడుతున్నాయి. కూటమి సర్కార్ ఉద్దేశపూర్వకంగానే సచివాలయాల ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆధార్‌కు ఫోన్ లింక్, తప్పొప్పుల సవరణ, ఈకేవైసీ తదితర సమస్యలు సచివాలయాల్లో పరిష్కారమయ్యేవి. ప్రస్తుతం ఆ సేవలు అందడం లేదు. సమస్య ఏదైనా ప్రజలకు మాత్రం ఆధార్ సేవలు మాత్రం అందడం లేదు. నెలల తరబడి ఆధార్ సేవలు నిలిచిపోయినా పట్టించుకోని అధికారుల తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. సాంకేతిక సమస్యలతో ఆధార్ సేవలు నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నా ప్రత్యామ్నాయంపై అధికారులు దృష్టి సారించకపోవడం వలనే ఈ సమస్యలని విమర్శలు వస్తున్నాయి. తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రైవేట్ ఆధార్ కేంద్రాలకు డిమాండ్ పెరిగింది.

విద్యార్థుల సమస్యలు వర్ణనాతీతం

విద్యార్థులకు సంబంధించి ప్రస్తుతం ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కార్డుల నమోదు ప్రక్రియ సాగుతోంది. అయితే అపార్ నమోదులో విద్యార్థులు పుట్టిన తేదీతో పాటు, పేరు, చిరునామా, తల్లిదండ్రుల పేర్లు పక్కాగా ఉండాల్సి ఉంది. చిన్న పొరపాటు ఉన్నా అపార్ ప్రక్రియ ముందుకు సాగదు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఆధార్ కార్డులలో మార్పులు చేయించుకోవాలని పంపిస్తున్నారు. ప్రభుత్వ ఆధార్ సేవలు అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తప్పుల సవరణకు విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఆధార్ క్యాంప్లను పర్యవేక్షించాల్సిన మండల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సమస్యలు పరిష్కారం కావడంలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలో ఉన్న ఐదు ఆధార్ కేంద్రాలను వినియోగంలోనికి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మొగల్తూరు ఏఈఈకి పదోన్నతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ భీమవరం ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని మొగల్తూరులో ఆపరేషన్స్ ఏఈఈగా పని చేస్తున్న ఎం.శివప్రసాద్‌కు డిప్యూటీ ఈఈగా పదోన్నతి కల్పిస్తూ ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన శివప్రసాద్‌ను ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని నల్లజర్ల డిప్యూటీ ఈఈగా బదిలీ చేశారు. ప్రస్తుతం నల్లజర్లలో ఆపరేషన్స్ డిప్యూటీ ఈఈగా పని చేస్తున్న జే. రామును శ్రీకాకుళం కమర్షియల్ డిప్యూటీ ఈఈగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మొగల్తూరులో కొండముచ్చి స్వైర విహారం

నరసాపురం రూరల్: కొండముచ్చి స్వైర విహారంతో ఆరు మేకలు బలయ్యాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధిలోకి కడలివారిపాలెం, కొండావారిపాలెం గోదావరి పేటల్లో ఒక కొండముచ్చి గత మూడు రోజులుగా తిరుగుతోంది. మూడు గ్రామాల్లోని ఇళ్లల్లో పెంచుకుంటున్న ఆరు మేకలను ఈ కొండముచ్చి చంపి ఆహారంగా తినేసింది. తమ ఇళ్ల వద్ద పెంచుకునే పెరటి కోళ్లు ఈ కొండముచ్చి బారిన పడితే వాటిని చంపేస్తుందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. స్థానిక పంచాయతీ, సంబంధిత అధికారులు స్పందించి ఈ కొండముచ్చి కోతిని పట్టించి అటవీ ప్రాంతానికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కళారత్న విజయం సినీ గ్రంథావిష్కరణ


కళారత్న విజయం సినీ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సినీ నటి కేఆర్ విజయ

పెనుగొండ: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వైట్ల కిషోర్‌కుమార్ వ్రాసిన కళారత్న విజయం సినీ గ్రంథాన్ని సినీ నటి కేఆర్ విజయ ఆవిష్కరించారు. ఈ మేరకు వైట్ల కిషోర్‌కుమార్ మంగళవారం ఆచంటలో విలేకరులతో మాట్లాడుతూ అభినయ సౌందర్య నిలయ కేఆర్ విజయ మీద రచించిన గ్రంథాన్ని ఆమె చేతుల మీదుగా చెన్నైలోని కేఆర్ విజయ నివాసంలో ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తమిళ నటులు కృష్ణమూర్తి, జె.సూర్య పాల్గొన్నట్లు తెలిపారు.

నేడు పాస్టర్ల సమావేశం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పట్టణ, మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశాన్ని బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు గోబేరు ఏసుకృపా శాంసన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని త్సవటపల్లివారి వీధిలో ఎస్ టవర్స్, మూడో అంతస్థు, నాళం గుప్త ఇంటి ఆవరణలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం పాస్టర్లపై వేధించే క్రమంలో వ్యక్తిగత సమాచారం సేకరించడాన్ని నిరసిస్తూ ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించనునట్లు ఆయన తెలిపారు.

పాలకొల్లు రూరల్ కార్యదర్శిగా సత్తిబాబు



పాలకొల్లు అర్బన్: పాలకొల్లు రూరల్ పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా చిటికెన సత్యనారాయణ (సత్తిబాబు) మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సత్తిబాబు ఇప్పటి వరకు పోడూరు మండలం పెనుమదం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. సత్తిబాబు గతంలో భీమవరం మండలంలోని పెదమీరం, కొయ్యలగూడెం, పాలకొల్లు మండలాల్లో పలు పంచాయతీల్లో కార్యదర్శిగా పనిచేశారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదు వేగంగా పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం: పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓట్లు నమోదు పక్రియ వేగంగా పూర్తి చేయాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఓట్లు నమోదుకు దరఖాస్తు గడువు బుధవారంతో ముగుస్తుందని చెప్పారు. సమయం ముగిసే వరకూ వచ్చిన దరఖాస్తు ప్రతీది తీసుకోవాలని సూచించారు. ఓట్ల కోసం వచ్చిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పేర్లు నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు. డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీపై అటెస్టెడ్ సంతకం కచ్చితంగా ఉండాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని చెప్పారు. అలాగే ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఓట్లు నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నరసాపురం తహసీల్దార్ రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దైవ యాత్రలకు గ్రామాల నుంచే ప్రత్యేక బస్సులు

పెనుమంట్ర: నరసాపురం డిపో నుంచి పంచారామ క్షేత్రాలు, శబరిమలై యాత్రలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి మంగళవారం మార్టేరులో తెలిపారు. మార్టేరులో అయ్యప్ప భక్తులను కలిసి తమ డిపో ద్వారా భక్తులకు ఏర్పాటు చేస్తున్న బస్సు సౌకర్యం గురించి వివరించారు. మూడు వారాలు పంచారామ క్షేత్రాలను దర్శించుకునేందుకు గ్రామాలనుండి 35 మంది సభ్యులు గ్రూపుగా ఏర్పడి ముందుగా తమకు తెలియజేస్తే అదే గ్రామం నుంచి పంచారామ క్షేత్రాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. అదేవిధంగా శబరిమలై యాత్రకు కూడా ముందుగా బుక్ చేసుకుంటే ఆర్టీసీ బస్సులను తక్కువ ధరకు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధి కూలీ మృతి

ఉండి: ఉండి మండలం అర్తమూరులో మంగళవారం పని చేస్తూనే పామర్తి వీరాస్వామి(80) అనే ఉపాధి కూలీ మృతి చెందాడు. పని చేస్తున్న స్థలంలోనే కుప్పకూలిపోవడంతో అతనిని వెంటనే ఇంటికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వృద్ధుని మృతి సమాచారం అందుకున్న మండల ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఒమేగారాజు ఘటనాస్థలికి వెళ్లి సమాచారం సేకరించారు. మృతి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియపరచి ప్రభుత్వం నుంచి అందే సహకారం అందించేందుకు సహకరిస్తామని ఆయన తెలిపారు.

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి


జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్ల సంఘం జిల్లా కమిటీ సభ్యులు

పాలకొల్లు అర్బన్: గత ప్రభుత్వంలో ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలపై వెంటనే జీఓల రూపంలో కూటమి ప్రభుత్వం విడుదల చేసి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా వైద్యాధికారి డా. మహేశ్వరరావుకి వినతిపత్రం అందజేశారు. వినతి పత్రంలోని వివరాలను ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు చింతపల్లి లక్ష్మి, కోశాధికారి ఎస్ లారెన్స్‌కుమారి విలేకరులకు తెలిపారు. ఆశ వర్కర్ల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62కి పెంచుతూ తక్షణం జీవో ఇవ్వాలని, అలాగే సెలవు, అనుమతుల విషయంలో ఆటంకాలను తొలగించాలని, ఆశ వర్కర్లకు రికార్డులు అందజేయాలని, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని, అలాగే వారి ప్రమేయంతో ఆశ వర్కర్లను తొలగించడం ఆపాలన్నారు. అలాగే అదే సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని లంకలకోడేరు పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ డా.నవ్యజీవన్‌కి అందజేశారు.

గర్భిణులకు సక్రమంగా సేవలందించాలి


లంకలకోడేరులో సిబ్బందికి సూచనలిస్తున్న డీపీహెచ్ఎన్ఓ వెంకటరత్నం

పాలకొల్లు అర్బన్: ఏఎన్ఎం, ఆశ వర్కర్లు గర్భిణీలను గుర్తించినప్పటి నుంచి వారికి ప్రభుత్వపరంగా సక్రమంగా సేవలందించాలని డీపీహెచ్ఎన్ఓ చెప్పారు. మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా ఏఎన్ఎం, ఆశలకు నిర్వహించిన సమావేశంలో వెంకటరత్నం మాట్లాడారు. గర్భిణులను ఎంసీహెచ్ కార్డులో నమోదు చేసి ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. అలాగే ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు నిర్దేశించిన రిజిస్టర్లు, రికార్డులు అన్ని సక్రమంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం ద్వారా గర్భిణులకు రూ.5వేలు అందుతుందన్నారు. అలాగే ఎన్టీఆర్ ఆరోగ్య ఆసరా పథకం ద్వారా గర్భిణులల ఖాతాల్లో మరో రూ.5వేలు గర్భితుల ఖాతాల్లో పడుతుందన్నారు. డీపీఎంఓ జక్కంపూడి రాం ప్రసాద్ లెప్రసీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి ఎలిజబెత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్ మంగ, పులఖండం సత్యవేణి తదతరులు పాల్గొన్నారు.

కేసు కొట్టివేతపై హర్షం


కేసు కొట్టివేతపై హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యలమంచిలి: సీఎం చంద్రబాబు దిష్టి బొమ్మ దహనం కేసులో ఏడేళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్న వైఎస్సార్ సీపీ నాయకులకు ఎట్టకేలకు ఉపశమనం కలిగింది. 2017లో పనికి ఆహార పథకంలో అవకతవకలు జరిగాయని వైఎస్సార్ సీపీ ఎంపీలు పార్లమెంటులో పిర్యాదు చేశారు. ఎంపీల చర్యను నిరసిస్తూ పాలకొల్లులో తెలుగుదేశం నాయకులు అప్పటి ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. దానిని నిరసిస్తూ అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు దిష్టి బొమ్మను మేడపాడు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు దహనం చేశారు. దీంతో 23 మంది నాయకులపై తెలుగుదేశం నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీంతో అప్పటి నుంచి 23 మంది కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. ఏడేళ్లపాటు విచారణ జరిగిన అనంతరం ఈ కేసును కొట్టివేస్తూ నరసాపురం కోర్టు జడ్జి మంగళవారం తీర్పు ఇచ్చారు. దీంతో నాయకులంతా హర్షం వ్యక్తం చేశారు.

సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటాం

ఉండి: చేసిన వాగ్దానాలు నెరవేర్చాలని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించే వారందరిపై ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తుందని ఇది ముమ్మాటికీ వ్యక్తి స్వేచ్ఛను హరించడమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి గొర్రుముచ్చు సుందర్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ సోషల్‌మీడియా కార్యకర్తలపై కుటురపూరితంగా అక్రమ కేసులతో బనాయించడంపై పార్టీ ఆదేశాల మేరకు వారికి భరోసా ఇస్తున్నట్లు తెలిపారు.

ఆదర్శ వ్యక్తులకు అభినందనలు


ఆదర్శ వ్యక్తులతో ఆర్‌డీఓ దాసిరాజు, సమాఖ్య సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: సమాజంలో తమ పని తాము చేసుకుంటూ ప్రచారానికి దూరంగా ఉండే వ్యక్తులు ఎంతో మంది ఉన్నారని అటువంటి వారిని గుర్తించి అభినందనందించడం గొప్ప విషయమని ఆర్‌డీఓ దాసి రాజు అన్నారు. మంగళవారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆదర్శ వ్యక్తుల అభినందన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ ఇలాంటి వ్యక్తులను అభినందించడం వల్ల సమాజానికి మరింత స్ఫూర్తిని అందించవచ్చన్నారు. 2011లో స్థాపించిన విద్యా చైతన్య సమాఖ్య ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న సమాఖ్య సభ్యులైన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైద్యం, విద్యా, బ్యాంకింగ్ రంగాల్లో పనిచేస్తున్న ఐదుగురు వ్యక్తులను ఎంపిక చేసినట్లు సమాఖ్య సభ్యులు దుర్గాప్రసాద్ తెలిపారు. తెలుగుబాష పరిరక్షణకు పాటుపడుతున్న డాక్టర్ చల్లా మల్లిఖార్జున శర్మ, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనభరుస్తున్న ఉపాధ్యాయులు బుంగ జెస్సీ కళ, శెట్టి రామారావు, దొంగ చింతయ్య, బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న కంకిపాటి నాగరాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ, సభ్యులు మంచెం ఉమామహేశ్వరరావు, తోలేటి గాంధీ, జవ్వాది నాగేశ్వరరావు, డివి ప్రసాద్, మంచెం కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వినోద పన్నుల విషయంలో నష్టం


నరసాపురం మునిసిపల్ కార్యాలయం

నరసాపురం: వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో నరసాపురం మునిసిపాలిటీలో నష్టం జరుగుతోంది. కనీస మాత్రంగా కూడా వినోదం, ప్రకటనలకు సంబంధించి పన్నులు రావడంలేదు. ఏటా వచ్చే నామమాత్రపు ఆదాయం కూడా, ఏళ్ల తరబడి వసూలు కాకుండా, మొండి బకాయిగా మిగిలిపోతుంది. వినోదం పన్ను రూపంలో మునిసిపాలిటీకి ఏడాదికి రూ.4 లక్షలు వసూలు అవుతుంది. ఇక ప్రకటనల పన్ను అయితే రూ 1.23 లక్షలు వస్తుంది. మొత్తంగా 5.23 లక్షలు పన్నులు వస్తున్నాయి. ఏడాదికి మునిసిపాలిటీకి ఆస్తి, కుళాయిలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తదితర రూపాల్లో రూ.2.75 కోట్లు ఆదాయం వస్తోంది. ఇందులో వినోదం, ప్రకటనల పన్నుల వాటా అత్యంత నామామాత్రంగా ఉంటుంది.

వసూలును పట్టించుకోని అధికారులు

వినోదం పన్నులు రూ.10 లక్షలు, వరకూ, ప్రకటనల పన్నులు రూ.3 లక్షలు వరకూ బకాయిలున్నాయి. వినోదం పన్నులు వద్దకు వచ్చే సరికి కేవలం సినిమా థియేటర్లపైనే ఆధారపడుతున్నారు. కేబుల్ నిర్వాహకుల నుంచి సవ్యంగా పన్నులు వసూలు చేయడం లేదు. సిటీ కేబుల్ నిర్వాహకుల నుంచి లక్షల్లో పన్నులు వచ్చే అవకాశం ఉన్నా.. వారి వద్ద నుంచి పన్నులు వసూలు చేయాలనే నిబంధనలు ఉన్నా.. పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఇక ఈ మధ్య కాలంలో ఎక్కడ పడితే అక్కడ ప్రకటనల హోర్డింగ్స్, ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. వీటి నుంచి కూడా పన్నులు వసూలు చేయడంలేదు. ఆదాయం వచ్చే మార్గాల్లో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తూ అధికారులు మునిసిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు. వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో ఉన్న లోపాలను సరిదిద్దే చర్యలు ఇప్పటికైనా చేపట్టాలనే డిమాండ్స్ వినిపిస్తున్నాయి.

ఆభరణాల చోరీ కేసులో నిందితుల అరెస్ట్


ఆభరణాల చోరీ కేసులో నిందితుల వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు

భీమవరం: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగ్‌లో బంగారు ఆభరణాలు దొంగిలించిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు భీమవరం డీఎస్పీ ఆర్.జి. జయసూర్య మంగళవారం విలేకరులకు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గతనెల 20వ తేదిన భీమవరం పట్టణానికి చెందిన కె.నాగ ఉమామహేశ్వరి వీరవాసరం మండలం బలుసుగొయ్యిపాలెం నుంచి భీమవరం వస్తుండగా బట్టల బ్యాగ్‌లోని బంగారు వస్తువులను దొంగిలించినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేయగా ఈ కేసులో నిందితులైన ఆకివీడుకు చెందిన గుద్దాటి వల్లియ్య, నరమామిడి పోశమ్మ, ఆవుల రవళి, బండి నర్సింహులు, నరమామిడి హరిబాబు వస్తువులను దొంగిలించారు. దీంతో దర్యాప్తు చేపట్టిన భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం. నాగరాజు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ జయసూర్య తెలిపారు. ఈ కేసులో నిందితుల నుంచి 7 కాసుల బంగారు హారం, 4 కాసుల నక్లెస్, 5 కాసుల రెండు గాజులు, 3 కాసుల 4 ఉంగరాలు, చెవిదిద్దులు, చెంప సవరాలు, పాపిడ బొట్టు, మ్యాటీలు, ముక్కుపుడకతో సహా 28 కాసులు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సీఐ నాగరాజు, ఎస్ఐ వై.బి. కిరణ్‌కుమార్, ఏఎస్సై ఈతకోట శ్రీను, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, రామకృష్ణలను ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ అభినందించారని డీఎస్పీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి పూజలు


పాలకొల్లు అర్బన్: నాగరాజుపేటలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు


పెనుగొండ: సిద్ధాంతంలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు


మొగల్తూరు: పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


పెనుమంట్ర: సత్తివారితోటలో పూజలు చేస్తున్న మహిళలు


నరసాపురం రూరల్: దుర్గా లక్ష్మణేశ్వరస్వామి ఆలయంలో పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నాగుల చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రసాదాలు చేతపట్టుకుని చిన్నారులతో కలిసి మహిళలు పొలాలకు వెళ్లి పుట్టలో పాలు పోశారు. కోడిగుడ్లు, తేగలు, గుర్రపు గుంజు, వడపప్పు, చలివిడి ప్రసాదాలు సమర్పించారు. చిన్నారులు పుట్టవద్ద బాణాసంచా కాల్చారు. నాగులచవితి నేపథ్యంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. -సాక్షి, నెట్‌వర్క్